క్లుప్తంగా

పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

లింగపాలెం: సింగగూడెం ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రేస్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ దిద్ల యంజాలో మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా రాత పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతు రాంబాబు, ఎంఈఓలు కె.రామారావు, జె.రవీంద్ర, జీజేఏ స్టీవెన్, ముస్తఫ్ ఆలీ, నీలం అంలిదేవి, ఆసపు అప్పారావు, ఎం.విజయరేఖ, హెచ్ఎం పువ్వుల ఆంజనేయులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లతో జనం ఇబ్బందులు



రోడ్డుపై పడిపోయిన పొగాకు బేళ్లు

కొయ్యలగూడెం: కన్నాపురం రోడ్డులోని రేపల్లె వాడ సమీపంలో శుక్రవారం వర్జీనియా పొగాకు బేళ్ల ట్రాక్టర్లు గోతులో పడి అదుపు తప్పింది. దీంతో బేళ్లు రోడ్డుపై పడిపోయాయి. రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి. బురద నీటిలో బేళ్లు పడిపోవడంతో వేలంకేంద్రం కొనుగోలు చేయవని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల గోతులను అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.

ఎన్నికలపై అవగాహన



మాక్ పోల్ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పరింపూడి బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మాక్ పోల్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు నిమ్మలూరి ఉమాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాలెట్ పేపర్ ఓటింగ్, బ్యాలెట్ బాక్స్, అభ్యర్థుల నమూనా పత్రాలు, స్థానిక ఎన్నికలకు సార్వత్రిక ఎన్నికలకు మధ్య తేడా తదితర విషయాలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ



స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న సీఐ

చింతలపూడి : స్థానిక ప్రైవేట్ స్కూల్ బస్సులను సీఐ క్రాంతి కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించి, డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేని బస్సులను సీజ్ చేస్తామని, మద్యం సేవించి వాహనం నడుపుతున్న డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్, మంటలను ఆర్పే పరికరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ప్రయాణించే బస్సుల భద్రతా ప్రమాణాలను పరిశీలించుకోవాలని సూచించారు.

విరిగిన విద్యుత్ స్తంభం



స్తంభాన్ని తొలగిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: మండలంలోని మక్కినవారిగూడెంలో భారీ వర్షానికి విద్యుత్ స్తంభం విరిగి పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలో గురువారం రాత్రి ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో మక్కినవారిగూడెంలో టి.నరసాపురం వెళ్లేరోడ్డులో పశువుల ఆసుపత్రి వద్ద ఉన్న విద్యుత్ స్తంభం నేలకూలింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. శుక్రవారం విద్యుత్ స్తంభం స్థానంలో వేరొక స్తంభాన్ని సిబ్బంది ఏర్పాటుచేశారు.

రేపు వైఎస్సార్ సీపీ సమావేశం

లింగపాలెం: మండలంలోని రంగాపురంలో ఆదివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ సీనియర్ నేత రెడ్డిన శ్రీనివాసరావు ఇంటి వద్ద పార్టీ లింగపాలెం మండల సమావేశం ఏర్పాటుచేశామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు తెలిపారు. ముఖ్యఅతిథిగా పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, సీనియర్ నేత బీవీఎస్ రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

చేపల చెరువుల్లో జంతు వ్యర్థాలు

- దుర్గంధంతో రైతుల ఇబ్బందులు
- చెరువుల వద్దే భారీగా జంతు వ్యర్థాల నిల్వలు

కొయ్యలగూడెం: జంతు వ్యర్థాలతో చేపల సాగు చేస్తుండడం పలు గ్రామాల్లో రైతులకు హాని చేస్తుండగా, ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. వేసవి ముగిసి ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు చెరువుల్లో నీరు చేరి క్రమేపీ చేపల సాగు పెరుగుతోంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా పెంపకందారులు జంతు వ్యర్థాలను మెషీన్లలో వేసి చేపలకు దాణాగా ఉపయోగిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో చెరువుల చుట్టూ తీవ్రదుర్గంధం వ్యాపిస్తోందని వ్యవసాయ పనులకు కూలీలు రావడం లేదని వాపోతున్నారు. దుర్గంధంతో రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. మారుమూల అటవీ ప్రాంతాలకు సమీపంలో అనధికారికంగా కొన్నిచోట్ల, అధికారికంగా మరికొన్ని చోట్ల చేపల సాగు చేస్తున్నారని, దాదాపు చెరువులు అన్నింటిలోనూ జంతు వ్యర్థాలనే దాణానే ఉపయోగిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. జంతు వ్యర్థాలను తినడానికి వచ్చే మృగాలు తమపై దాడులు చేస్తున్నాయని, రాత్రి సమయంలో పొలాలకు వెళ్లలేకపోతున్నామని గంగవరం, రాజవరం గ్రామాల రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



జంతు వ్యర్థాలతో దాణా తయారీకి ఉపయోగిస్తున్న యంత్రం



మంగపతిదేవి పేట సమీపంలో వ్యర్థాలతో నిండి ఉన్న చెరువు

పశువులు చెరువుల్లో నీరు తాగుతుంటే వ్యాధుల బారిన పడుతున్నాయని చెబుతున్నారు. తెలంగాణ నుంచి నిత్యం వాహనాల్లో వస్తున్న జంతు వ్యర్థాలను గోడౌన్లలో భారీగా నిల్వ ఉంచి, అనంతరం వాటిని దాణాగా ఇతర ప్రాంతాల్లోని చేపల చెరువుల నిర్వాహకులకు విక్రయిస్తున్నట్టు చెబుతున్నారు. ఒక్కోసారి చెరువుల్లో వేస్తున్న జంతు వ్యర్థాల ప్రభావానికి కొన్ని రకాల చేపలు మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. నిషేధిత జాతుల చేపలు వ్యర్థాల కారణంగా ఒకటికి నాలుగు రెట్లు ఉత్పత్తి అధికంగా ఉండడంతో పెంపకందారులంతా జంతు వ్యర్థాల వినియోగానికే ప్రాధాన్యత ఇస్తున్నారని చెబుతున్నారు. కొయ్యలగూడెం మండల వ్యాప్తంగా అనేక చెరువుల్లో జంతు వ్యర్థాలతోనే చేపల సాగు చేస్తున్నారని తెలిపారు. ఐతే మత్స్యకార సంఘాలు నిబంధనలతో కూడిన దాణాను వినియోగిస్తున్నప్పటికీ వారికి కూడా స్థానికులతో ఘర్షణలు ఏర్పడుతున్నాయని ఫిషరీ డిపార్ట్‌మెంట్ అధికారులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులను లోబరుచుకోవడం వల్ల అక్రమాలకు పాల్పడుతున్నారని, ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



గంగవరం చెరువులో వ్యర్థాల ప్రభావానికి చనిపోయిన చేపలు

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



మృతిచెందిన గేదె

లింగపాలెం: మండలంలోని యడవల్లి గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతానికి గేదె బలైంది. రాచూరి జోజికి చెందిన గేదె పొలంలో మేత మేసేందుకు వెళ్లి నేలపై పడి ఉన్న విద్యుత్ తీగకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం వల్లే గేదె మరణించిందని జోజి ఆవేదన వ్యక్తం చేశారు. తను న్యాయం చేయాలని కోరారు.

20న చెస్ పోటీలు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 20న అంతర్జాతీయ చెస్ డే సందర్భంగా చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ జంగారెడ్డిగూడెం ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్ బాబు, సెక్రెటరీ సంధ్య ప్రవల్లికలు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక మల్లాది సీతారామలింగేశ్వర రోటరీ కమ్యూనిటీ హాల్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మూడు విభాగాల్లో చెస్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు చెస్ బోర్డ్, మెటీరియల్ ఎవరికి వారే సమకూర్చుకోవాలని, ఉదయం 8.30 గంటలకు తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

శాకంబరిగా దుర్గమ్మ దర్శనం

జంగారెడ్డిగూడెం: స్థానిక హైస్కూల్ వద్ద కొలువై ఉన్న కనకదుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారిని శుక్రవారం ఆషాఢమాసం పురస్కరించుకుని శాకంబరిగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. చిట్లూరి వీరభద్రం, స్వాతి దంపతులు, గణేశ సూర్యభగవాన్‌ల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఆలయ కమిటీ తెలిపింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రూ.25,116 విరాళం

జంగారెడ్డిగూడెం శ్రీ నూకాలమ్మ ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన కర్పూరం త్రివిక్రమరావు కుటుంబ సభ్యులు రూ.25,116 విరాళం అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. దాతలను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలు అందజేశామన్నారు. శుక్రవారం సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశామని ఆలయ కమిటీ అధ్యక్షులు రొంగల నాగేశ్వరరావు తెలిపారు.



జంగారెడ్డిగూడెం కనకదుర్గమ్మ



బయ్యనగూడెం కనకదుర్గమ్మ

జ్ఞాన సరస్వతికి పూజలు

గురవాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి ఉపాలయంలో శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారికి పంచామృత అభిషేకాలు చేశారు.

శాకంబరిగా శక్తి స్వరూపిణి

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెంలోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మను శుక్రవారం శాకంబరిగా అలంకరించి పూజలు చేశారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లు అమ్మవారి మూలవిరాట్ విగ్రహానికి అలంకరించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణ చేసి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. కొయ్యలగూడెం, కన్నాపురం, గవరవరం, యర్రంపేట గ్రామాల్లో ఉన్న కనకదుర్గ ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

పోలవరం రూరల్: రైతులు చిరు ధాన్యాల సాగు వైపుగా వెళ్లాలని, మార్కెట్ కూడా ఆశా జనకంగానే ఉందని ఏరువాక ఏలూరు జిల్లా సీనియర్ శాస్త్రవేత్త కె.ఫణికుమార్, ఎక్స్‌టెన్షన్ శాస్త్రవేత్త ఎన్.నాగేంద్రబాబులు అన్నారు. పోలవరం మండలం వింజరం పంచాయతీలో చిరుధాన్యాలు సాగు ప్రాముఖ్యతపై ఏర్పాటుచేసిన సదస్సులో వారు మాట్లాడారు. సిరి (చిరు) ధాన్యాలు సాగు చేస్తే విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. మినుములు బీవీఎన్-8, పీయూ-31, టీబీజీ-104 రకాల లక్షణాలు, దిగుబడులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మొక్కజొన్న పంటపై ముఖ్యంగా కత్తెర పురుగు నివారణకు పురుగు మందులు, బయోలాజికల్ కంట్రోల్ పద్ధతులను పాటించాలన్నారు. జాతీయ ఆహార భద్రత, పోషక మిషన్ పథకంలో భాగంగా 50 శాతం రాయితీపై వచ్చిన మినుములు విత్తనాలను సర్పంచ్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వింజరం సర్పంచ్, మండల వ్యవసాయ అధికారి పోలవరం, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రైతులకు అందుబాటులో ఉండాలి

చింతలపూడి : వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉం,డి సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా ఆదేశించారు. చింతలపూడి సబ్ డివిజన్లో వ్యవసాయశాఖ సిబ్బందికి స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని, రుణాలు ఇప్పించాలని క్రాఫ్ ఇన్సూరెన్స్ కట్టించాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించబోతున్న సందర్భంగా రైతుల గ్రీవెన్స్‌ను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం స్టేట్ బ్యాంక్ మేనేజర్‌ను కలిసి రైతులకు రుణాలు మంజూరు చేయాలని, ఇన్సూరెన్స్ త్వరగా కట్టించాలని కోరారు. కార్యక్రమంలో నాలుగు మండలాల మండల వ్యవసాయ అధికారులు మురళి, ప్రదీప్, ముత్యాలరావు, ప్రియాంక, టెక్నికల్ ఏఓ ప్రసూన,. సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హబీబ్ బాషా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ద్వారకాతిరుమల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ ఎం.అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారకాతిరుమల టౌన్, వసంత్‌నగర్ కాలనీ, కొమ్ముగూడెం, లక్ష్మీపురం కాలనీ, టెంపుల్ ఫీడర్ విద్యుత్ సరఫరా, అలాగే దొరసానిపాడు, సీహెచ్ పోతేపల్లి, జాజులకుంట, నారాయణపురం, గొల్లగూడెం, తిమ్మాపురం గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆత్మీయ కలయిక

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసినట్టు పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిటికన శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.



సజ్జలతో చిటికన

హనుమాన్ చాలీసాకు తరలిరండి

దెందులూరు: ఈనెల 19న హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో హనుమాన్ చాలీసా మహా యజ్ఞంకు భక్తులంతా తరలిరావాలని బ్రాహ్మణ సేవా సంఘం ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు పెనుమాక వాసుదేవరావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం మాదేపల్లిలో ఆయన మాట్లాడారు. 1108 గొంతుకలతో భక్తితో ఒకే సంకల్పంతో ఏకకాలంలో జరిగే హనుమాన్ చాలీసా మహా యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని స్వామివారి ఆశీర్వాదం తీసుకోవాలని కోరారు.

ప్రతి కుంటుంబానికీ బీమా అవసరం

జంగారెడ్డిగూడెం: వ్యక్తి నష్టాన్ని తీర్చలేకపోయినా, ఆర్థిక నష్టాన్ని కొంత మేర భర్తీ చేసుకోవాలంటే బీమా తప్పనిసరి అని ఎస్‌బీఐ స్థానిక మేనేజర్ భీమశంకరరావు అన్నారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం భారతదేశంలో బీమా పాత్రపై ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాదబాబు అధ్యక్షతన ఏర్పాటుచేసిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబమూ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే బీమా పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ ఎం మధు, కామర్స్ అధ్యాపకులు సీహెచ్ రమాదేవి, వి.హనుమంతరావు మాట్లాడారు. సీనియర్ అధ్యాపకులు యు.వెంకటాచార్యులు ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బీమా పాత్రపై వివరిస్తున్న మేనేజర్ భీమశంకరరావు

మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది నిరసన

చింతలపూడి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది (వాటర్ వర్కర్స్) గురువారం రెండో రోజు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బందికి మద్దతుగా తాము కూడా సమ్మెలోకి వెళ్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వానికి మొరపెట్టుకున్న తమ సమస్యలు పరిష్కారం కావడంలదేని చింతలపూడి యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు ఎ.నాగరాజు, విజయ రాజు, నాయకులు ఎస్‌డీ సలీం, సత్యం, నాగరాజు, మనోహర్ తదితరులు తెలిపారు.



నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

హెచ్‌ఆర్, ఏసీఏ సంఘ జిల్లా చైర్మన్‌గా రమేష్ బాబు

ద్వారకాతిరుమల: మానవ హక్కులు, అవినీతి నిరోధక సంఘం ఏలూరు జిల్లా చైర్మన్‌గా ద్వారకాతిరుమలకు చెందిన కొండా రమేష్ బాబు నియమితులయ్యారు. గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో రమేష్ బాబుకి హ్యూమన్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండారెడ్డి మల్లికార్జున రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన మల్లికార్జున రెడ్డికి, సహకరించిన నేషనల్ డైరెక్టర్ భయపనేని వెంకటేశ్వర్లు, నేషనల్ జనరల్ సెక్రటరీలు రావులపల్లి తిరుపతయ్య, రొడ్డ తిరుపతయ్య, ఏపీ మహిళా విభాగం వారికి రమేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.



నియామక పత్రం అందిస్తున్న మల్లికార్జున రెడ్డి

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

చింతలపూడి : వైఎస్సార్ సీపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండ కృషి చేస్తానని ఆ పార్టీ చింతలపూడి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్ రమేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సీతానగరం, యర్రగుంటపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి పార్టీ కార్యకర్తలు, నాయకులను కలుసుకున్నారు. సీతానగరంలో రమేష్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే గ్రామ కమిటీలను ప్రకటిస్తానని తెలిపారు. పార్టీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షురాలు జానకి రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. పార్టీని మండలంలో బలోపేతం చేసుకుని మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గాయం మల్లేశ్వరి, ఎంపీటీసీ కలకండ రాంబాబు, చింతపల్లి సర్పంచ్ తాండ్ర రామకృష్ణ, ప్రగడవరం సర్పంచ్ టి భూపతి, ప్రగడవరం ఎంపీటీసీ నాగలక్ష్మీ రమేష్ ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిరుద్యోగుల పాలిట శాపం కూటమి ప్రభుత్వం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జేపీ, పార్టీ నేతలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సమన్వయకర్త జేపీ

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో ఒక్క కొత్త ప్రభుత్వ ఉద్యోగమైనా ఇచ్చారా? కనీసం ఎన్నికల హామీల్లో ముఖ్యమైన నిరుద్యోగ భృతి వేశారా అంటూ వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ ప్రశ్నించారు.. ఏలూరు నగరంలో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ నేతలు మూడు డివిజన్లలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. 35, 43 డివిజన్లలో పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, 44వ డివిజన్‌లో పార్టీ నేతలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సమన్వయకర్త జేపీ మాట్లాడుతూ టీడీపీ, జనసేన అధినేతలు ఇద్దరూ గత ఎన్నికల్లో సంయుక్తంగా ప్రజలను ఎన్నికల హామీలను నెరవేర్చుతామంటూ హామీ పత్రాలను ఇచ్చారని, ఏడాది గడచినా దాని ఊసే లేదని ఆరోపించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తాము అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది 4 లక్షల ఉద్యోగాల చొప్పున ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగ యువతను నమ్మించారని గుర్తుచేశారు. ఆఖరికి వలంటీర్లను సైతం దారుణంగా మోసం చేశారనీ, రూ.10 వేలు ఇస్తామని చెప్పారని, గౌరవవేతనం సంగతి అటుంచి కనీసం ఉపాధి లేకుండా తొలగించారని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య రంగాన్ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. నేడు పేదలకు పెద్ద రోగమొస్తే ఎక్కడికి వెళ్లాలో తెలియక తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, ఆరోగ్యశ్రీ బకాయిలు సైతం చెల్లించకపోవటంతో హాస్పిటల్స్‌లో పేదలకు వైద్యం అందే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమాల్లో స్థానిక నేతలు గుడిదేశి లక్ష్మీశారద, గేదెల సూర్యనారాయణ, కాగాని అచ్చిబాబు, రౌతు రామకృష్ణ, గొర్రెల శ్రీనివాస్, కే.వెంకటేశ్వరరావు, మజ్జి ప్రసాద్, మజ్జి లక్ష్మి, మీసాల రమణమ్మ, యలమాటి కృష్ణ, మేతర సురేష్, కొవ్వాడ దుర్గారావు, మల్లెల సత్యనారాయణ, బుజ్జమ్మ, కొత్తపల్లి రాణి, మధుబాబు, నామాల రమేష్, యేసుబాబు, ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

రక్షణ కల్పించాలంటూ ధర్నా

ఏలూరు (టూటౌన్): ఏలూరులోని మొబైల్ షాపుల యజమాల నుంచి తమ షాపులకు, షాపులో పనిచేసే కార్మికులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఏలూరులోని మొబైల్ విడిభాగాల షాపు యజమానులు, సిబ్బంది శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. 15 ఏళ్లుగా రాజస్థాన్ నుంచి వచ్చిన తాము ఏలూరులో షాపులు అద్దెకి తీసుకొని, మొబైల్ విడి భాగాలు విక్రయిస్తున్నట్టు చెప్పారు. ఇటీవల తమ షాపులపై కొందరు దాడులు చేయగా, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. .

'హామీల అమలుకు ఉద్యమిస్తాం'

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినా ఎన్నికల హామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందిందని, వాటి అమలు కోసం ఉద్యమాలు చేస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తెలిపారు. బాడిశ రాము అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు ఆగస్టు 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, నేతలు డి.ప్రభాకర్, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువుల నివారణ చర్యలు

దెందులూరు: ప్లాస్టిక్ వస్తువుల నివారణకు కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీలత కోరారు. శుక్రవారం ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఏలూరు రూరల్ మండలంలో ఏర్పాటైన టీములు శనివారం ప్లాస్టిక్ వస్తువుల వాడకం, పొల్యూషన్ నష్టాలు పర్యావరణ పరిరక్షణకు తూట్లు ఇతర అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించాలన్నారు.